रजिस्ट्री सं. डी-२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య. డి-221

मूल्य रु. १५-००
Price Rs. 15-00
మూల్యము : రూ. 15-00

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ
भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1
प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १. | नई दिल्ली | गुरुवार | ७ अगस्त, २०२५ | श्रावण | खंड ३२ |
| No.1 | New Delhi | Thursday | 7 August, 2025 | Shravana | Vol. 32 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | గురువారము | 7 ఆగస్టు, 2025 | శ్రావణ | సంపుటము 32 |

MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 3rd July, 2025

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Conservation of Foreign Exchange and Prevention of Smuggling Activities Act, 1974 [Act No.52 of 1974], (2) The Coal Mines (Special Provisions) Act, 2015 [Act No.11 of 2015], (3) The National Commission for Indian System of Medicine Act, 2020 [Act No.14 of 2020], (4) The National Institutes of Food Technology, Entrepreneurship and Management Act, 2021 [Act No.19 of 2021] are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

## శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) విదేశీ మారకద్రవ్యము సంరక్షణ మరియు దొంగ రవాణా కార్యకలాపముల నివారణ చట్టము, 1974 (1974లోని 52వ చట్టము), (2) బొగ్గు గనుల (ప్రత్యేక నిబంధనలు) చట్టము, 2015 (2015లోని 11వ చట్టము), (3) భారతీయ వైద్య విధాన జాతీయ కమీషను చట్టము, 2020 (2020లోని 14వ చట్టము), (4) ఆహార పదార్థ సాంకేతికత, వ్యవస్థాపకత మరియు నిర్వహణ జాతీయ సంస్థల చట్టము, 2021 (2021లోని 19వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# ఆహార పదార్థ సాంకేతికత, వ్యవస్థాపకత మరియు నిర్వహణ జాతీయ సంస్థల చట్టము, 2021

## (2021లోని 19వ చట్టము)

**(30 జూలై, 2021)**

**కొన్ని ఆహార పదార్థ సాంకేతికత, వ్యవస్థాపకత మరియు నిర్వహణ సంస్థలు కొన్నింటిని జాతీయ ప్రాముఖ్యత గలవిగాను మరియు ఆహార పదార్థ సాంకేతికత, వ్యవస్థాపకత మరియు నిర్వహణలో సూచనలు మరియు పరిశోధనను అందించుటకు అభ్యసనను పెంపొందించి, సదరు పరిజ్ఞానమును విస్తరింపచేయుటకు మరియు అందుకు సంబంధించిన లేదా వాటి ఆనుషంగికమైన విషయములను ప్రఖ్యానము చేయుటకైన చట్టము.**

భారత గణరాజ్యము యొక్క డెబ్బది రెండవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - I

## ప్రారంభిక

సంగ్రహనామము మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును, ఆహార పదార్థ సాంకేతికత, వ్యవస్థాపకత మరియు నిర్వహణ జాతీయ సంస్థల చట్టము, 2021 అని పేర్కొనవచ్చును.

(2) ఇది, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన[1] అమలులోనికి రావలెను:

అయితే, ఈ చట్టము యొక్క వేరువేరు నిబంధనలకు వేరువేరు తేదీలను నియతము చేయవచ్చును మరియు ఈ చట్టము యొక్క నిబంధనలకు చేయబడిన ఏదేని నిర్దేశము, ఆ నిబంధన అమలులోనికి వచ్చుటకు చేయబడిన నిర్దేశముగా అన్వయించుకొనవలెను.

కొన్ని సంస్థలను జాతీయ ప్రాముఖ్యత గలవిగా ప్రఖ్యానము చేయుట.

2. అనుసూచిలో పేర్కొనబడిన సంస్థల లక్ష్యములను బట్టి, వాటిని జాతీయ ప్రాముఖ్యతగల సంస్థలుగా చేయుటకు, అట్టి ప్రతి సంస్థను జాతీయ ప్రాముఖ్యతగల సంస్థగా ఇందుమూలముగా ప్రఖ్యానము చేయడమైనది.

నిర్వచనములు.

3. ఈ చట్టములో, సందర్భము ఇతర విధముగా కోరబడిననే తప్ప,-

(ఎ) సంస్థకు సంబంధించి "బోర్డు" అనగా 11వ పరిచ్ఛేదములో పేర్కొనబడిన పాలకమండలి అని అర్థము;

(బి) "ఛైర్‌పర్సన్" అనగా బోర్డు యొక్క ఛైర్‌పర్సన్ అని అర్థము;

---

1. 2021 సెప్టెంబరు 30వ తేదీగల అధిసూచన నెం.ఎస్.ఓ.4036(ఇ) ద్వారా 2021, అక్టోబరు 1వ తేదీ భారత రాజపత్రము అసాధారణ సంచిక, భాగము-II యొక్క 3(ii) పరిచ్ఛేదమును చూడుము.

(సి) అనుసూచి యొక్క 2వ గడిలో పేర్కొనబడిన సంస్థకు సంబంధించి "తదనుగుణమైన సంస్థ" అనగా సదరు అనుసూచి యొక్క 3వ గడిలో నిర్దిష్టపరచబడినట్టి సంస్థ అని అర్థము;

(డి) "కౌన్సిల్" అనగా 28వ పరిచ్ఛేదము క్రింద స్థాపించబడిన కౌన్సిల్ అని అర్థము;

(ఇ) "డైరెక్టరు" అనగా 19వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన, సంస్థ యొక్క డైరెక్టరు అని అర్థము;

(ఎఫ్) "ప్రస్తుతమున్న సంస్థ" అనగా అనుసూచి యొక్క 2వ గడిలో పేర్కొనబడినట్టి సంస్థ అని అర్థము;

(జి) "నిధి" అనగా 33వ పరిచ్ఛేదము క్రింద నిర్వహించబడునట్టి సంస్థ యొక్క నిధి అని అర్థము;

(హెచ్) "సంస్థ" అనగా అనుసూచి యొక్క 3వ గడిలో పేర్కొనబడినట్టి సంస్థ అని అర్థము;

(ఐ) "సభ్యుడు" అనగా బోర్డు యొక్క సభ్యుడు అని అర్థము మరియు ఛైర్‌పర్సన్ చేరి యుండును;

(జె) "అధిసూచన" అనగా అధికారిక రాజపత్రములో ప్రచురించబడినట్టి అధిసూచన అని అర్థము;

(కె) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(ఎల్) "రిజిస్ట్రారు" అనగా 20వ పరిచ్ఛేదము క్రింద నియమించబడినట్టి సంస్థ యొక్క రిజిస్ట్రారు అని అర్థము;

(ఎమ్) "అనుసూచి" అనగా ఈ చట్టమునకు అనుబంధించబడినట్టి అనుసూచి అని అర్థము;

(ఎన్) "సెనేట్" అనగా 16వ పరిచ్ఛేదములో పేర్కొనబడినట్టి సంస్థ యొక్క సెనేట్ అని అర్థము;

(ఓ) "సంఘము" అనగా సంఘముల రిజిస్ట్రీకరణ చట్టము, 1860 (1860లోని 21వది) క్రింద సంఘముగా రిజిస్టరైనట్టి అస్థిత్వమునందున్న సంస్థ అని అర్థము; మరియు

(పి) ఏదేని సంస్థకు సంబంధించి "పరినియమములు మరియు అధ్యాదేశములు" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన సంస్థ యొక్క పరినియమములు మరియు అధ్యాదేశములు అని అర్థము.

## అధ్యాయము - II

## సంస్థలు

సంస్థల నిగమనము.

4. ఈ చట్టము ప్రారంభమున మరియు ఆ తేదీ నుండి, అనుసూచి యొక్క 3వ గడిలో పేర్కొనబడినట్టి ప్రతి సంస్థ ఒక నిగమ నికాయముగా ఉండి, శాశ్వత ఉత్తరాధికారమును మరియు సామాన్య మోహరును కలిగివుండి, ఈ చట్టపు నిబంధనలకు అధ్యధీనమై చర, స్థిరాస్తులు రెంటిని సేకరించుటకు, కలిగివుండుటకు మరియు వ్యయనము చేయుటకు మరియు సదరు నామముతో కాంట్రాక్టులు చేసుకొనుటకు, దావాలు వేయుటకు మరియు దావాలు వేయబడుటకు అధికారమును కలిగివుండవలెను.

సంస్థల నిగమన ప్రభావము.

5. ఈ చట్టము ప్రారంభమున మరియు సదరు తేదీ నుండి,-

(ఎ) తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములో లేదా కాంట్రాక్టులో లేదా ఇతర దస్తావేజులో అస్థిత్వమునందున్న సంస్థకుగల ఏదేని నిర్దేశమును తదనుగుణమైన సంస్థకుగల నిర్దేశముగా భావించబడవలెను;

(బి) అస్థిత్వమునందున్న సంస్థ యొక్క చర, స్థిరాస్తులన్నియు లేదా దానికి చెందినట్టి సమస్త ఆస్తులు తదనుగుణమైన సంస్థలో నిహితము కావలెను;

(సి) అస్థిత్వమునందున్న సంస్థ యొక్క అన్ని హక్కులు, మరియు దాయిత్వములు, తదనుగుణమైన సంస్థ యొక్క హక్కులు మరియు దాయిత్వములుగా ఉండి దానికి బదిలీ చేయబడవలెను;

(డి) అట్టి ప్రారంభమునకు అవ్యవహితపూర్వము, అస్థిత్వమునందున్న సంస్థచే నియమించబడిన ప్రతి వ్యక్తి, తదనుగుణమైన సంస్థలో తన ఉద్యోగము లేదా సర్వీసును, అదే కాలావధిపాటు, అదే ప్రతిఫలముపై, ఈ చట్టము చేయబడక ఉండినప్పటికీ పింఛను, సెలవు, ఉపదానము, భవిష్యనిధి మరియు ఇతరములకు సంబంధించి అవే హక్కులు మరియు విశేషాధికారములు కలిగివుండును మరియు అతని ఉద్యోగము పరిసమాపనము లేదా అట్టి పదవీకాలము, ప్రతిఫలము, నిబంధనలు మరియు షరతులను పరినియమముల ద్వారా తగు రీతిగా మార్పు చేయునంతవరకు యథావిధిగా కొనసాగవలెను:

అయితే, ఆ విధంగా చేయబడిన మార్పులు అట్టి ఉద్యోగికి ఆమోద యోగ్యము కానప్పుడు, సదరు ఉద్యోగితో చేసుకున్న ఒప్పందపు నిబంధనలు మరియు షరతులకు అనుగుణంగా సంస్థ అతనిని ఉద్యోగము నుండి తొలగించవచ్చును లేదా ఇందు గురించి అందులో నిబంధనలు చేయనట్లయితే, శాశ్వత ఉద్యోగి విషయంలో మూడు మాసముల ప్రతిఫలమునకు సమానమైన మరియు ఇతర ఉద్యోగి విషయంలో ఒక మాసపు ప్రతిఫలమును నష్టపరిహారముగా సంస్థ అతనికి చెల్లించవలెను:

అంతేకాకుండా తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము లేదా ఏదేని పత్రము లేదా ఇతర దస్తావేజు క్రింద ప్రస్తుతమున్న సంస్థ యొక్క డైరెక్టరు లేదా వైస్-ఛాన్సలర్ మరియు ఇతర అధికారుల పదముల స్వరూపమునకు ఏదేని నిర్దేశమును, తదనుగుణమైన సంస్థ యొక్క డైరెక్టరు మరియు ఇతర అధికారులకు నిర్దేశముగా అన్వయించుకొనవలెను:

(ఇ) ఈ చట్టము ప్రారంభమునకు ముందు అస్థిత్వతమునందున్న సంస్థలో, ఏదేని విద్యావిషయిక లేదా పరిశోధనను కొనసాగించుచున్న ప్రతి వ్యక్తి అట్టి ప్రారంభమున తదనుగుణమైన సంస్థకు వలసపోయినట్లు మరియు రిజిస్ట్రరైనట్లుగా భావించబడి అట్టి వ్యక్తి వలసపోయినట్టి సంస్థలోని కోర్సు యొక్క అదే స్థాయిలో కొనసాగవలెను; మరియు

(ఎఫ్) ఈ చట్టము ప్రారంభమునకు అవ్యవహితపూర్వము అస్థిత్వమునందున్న సంస్థపై లేదా దాని ద్వారా ప్రారంభించబడిన లేదా ప్రారంభించబడదగు అన్ని దావాలు మరియు ఇతర శాసనిక చర్యలు, తదనుగుణమైన సంస్థ ద్వారా లేదా దానిపై కొనసాగించబడి మరియు ప్రారంభించవలెను.

సంస్థల యొక్క అధికారములు మరియు కృత్యములు.

6. (1) ఈ చట్టపు నిబంధనలకు అధ్యధీనమై ప్రతి సంస్థ, ఈ క్రింది అధికారములను వినియోగించవలెను మరియు కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) ఆహార విజ్ఞానశాస్త్రము మరియు ఆహార పదార్థ సాంకేతికత వంటి శాఖలు మరియు సంస్థ సముచితమని భావించిన ఇంజనీరింగ్, సాంకేతిక విజ్ఞానం, విజ్ఞానశాస్త్రము మరియు మేనేజ్‌మెంట్ యొక్క ఏవేని ఇతర శాఖలు మరియు అట్టి శాఖలలో పురోగమన అభ్యాసనము మరియు విజ్ఞానమును వ్యాపింపచేయుట కొరకు బోధన మరియు పరిశోధనను అందించడం;

(బి) పరీక్షలు నిర్వహించుట మరియు డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికేట్లు మరియు ఇతర విద్యా విషయిక విశిష్టతలు లేదా బిరుదులను ప్రదానము చేయుట;

(సి) గౌరవ డిగ్రీలు లేదా ఇతర బిరుదులను ప్రదానము చేయుట;

(డి) రుసుములు మరియు ఇతర ఛార్జీలను నిర్ణయించును, చెల్లించమని కోరును మరియు స్వీకరించును;

(ఇ) నివాస విద్యార్థుల కొరకు హాళ్లు మరియు వసతి గృహములను ఏర్పాటు చేసి, నడిపించుట మరియు నిర్వహించుట;

(ఎఫ్) సంస్థ యొక్క అన్ని వర్గముల ఉద్యోగులు మరియు విద్యార్థులలో క్రమశిక్షణను పర్యవేక్షించి మరియు నియంత్రించుట వారి యొక్క ఆరోగ్యము, సాధారణ సంక్షేమము, సాంస్కృతిక మరియు సామూహిక జీవనమును వృద్ధిచేయుటకు ఏర్పాట్లు చేయట;

(జి) విద్యార్థుల కొరకు జాతీయ క్యాడెట్ కాప్స్ యూనిట్లను సమకూర్చి వాటిని నిర్వహించుట;

(హెచ్) డైరెక్టరు మినహా, విద్యా విషయిక మరియు ఇతర పోస్టులను ఏర్పాటు చేయును మరియు వాటికి నియామకములు చేయుట;

(ఐ) సంస్థ తన లక్ష్యాలను పురోగమింపజేసేందుకు తాను ఉచితమని తలచునట్టి రీతిలో, సంస్థకు చెందిన లేదా అందు నిహితమైన ఏవేని లావాదేవీలు జరుపుట;

(జె) ప్రభుత్వము నుండి బహుమతులు, అనుదానములు, దానములు లేదా ఉపకారములను స్వీకరించుట మరియు వీలునామా కర్తలు, దాతలు లేదా సందర్భానుసారము బదిలీకర్తల నుండి వీలునామా ద్వారా ఇచ్చిన, దానములు మరియు బదలాయింపు ద్వారా స్థిర మరియు చరాస్తులను స్వీకరించుట;

(కె) ప్రపంచంలో ఏ భాగంలో ఉన్న విద్యా లేదా ఇతర సంస్థలతో సంపూర్ణంగా లేదా పాక్షికంగా సారూప్య లక్ష్యాలను కలిగియున్న సంస్థల నుండి అధ్యాపకులు లేదా పండితులను మార్పిడి చేసుకోవడం మరియు సాధారణంగా వారి యొక్క ఉమ్మడి లక్ష్యాలకు సహాయకారిగా ఉండు అట్టి రీతిలో సహకరించుకోవడం మరియు కలిసి పనిచేయడం;

(ఎల్) ఫెలోషిప్పులు, స్కాలరుషిప్పులు, ప్రదర్శనలు, బహుమతులు మరియు పతకములను ప్రారంభించి మరియు వాటిని ప్రదానము చేయుట; మరియు

(ఎమ్) సంస్థ యొక్క అన్నీ లేదా వాటిలోని ఏవేని లక్ష్యములను సిద్ధింపజేసేందుకు అవసరమైన, ఆనుషంగికమైన మరియు సహాయకమైన అన్ని విషయములను చేపట్టుట.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికినీ, కేంద్ర ప్రభుత్వ పూర్వ ఆమోదము లేకుండా ఏదేని చరాస్తిని ఏ రీతిలోనైనను సంస్థ విక్రయించరాదు.

సంస్థలలో అన్ని తెగలు, మతములు, తరగతుల వారికి ప్రవేశము ఉండుట.

7. (1) ప్రతి సంస్థ లింగ, జాతి, మతము, కులము లేదా వర్గముతో సంబంధం లేకుండా అందరి వ్యక్తులకు ప్రవేశం కల్పించవలెను మరియు సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు లేదా కార్మికులు లేదా ఎవరేని ఇతర సంబంధికులను చేర్చుకొనుట లేదా నియమించుటలో మతపరమైన విశ్వాసము లేదా వృత్తిపరంగా ఏ విధమైన పరీక్ష లేదా షరతును విధించరాదు.

(2) ఈ పరిచ్ఛేదపు స్ఫూర్తి మరియు లక్ష్యమునకు విరుద్ధముగా ఉండగలవని కౌన్సిలు అభిప్రాయపడిన షరతులు లేదా బాధ్యతతో కూడిన ఏదేని వీలునామా ద్వారా ఆస్తి, దానము లేదా ఏదేని ఆస్తి యొక్క బదిలీని సంస్థ అంగీకరించరాదు.

(3) ప్రతి సంస్థలోని ప్రతియొక విద్యావిషయిక కోర్సు లేదా అధ్యయన కార్యక్రమము నందలి ప్రవేశము సదరు సంస్థచే ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే దాని ప్రాస్పెక్టసు ద్వారా వెల్లడించి పారదర్శకత మరియు సహేతుకమైన అభిలక్షణము ద్వారా అంచనా వేసిన ప్రతిభ ఆధారంగా ఉండవలెను:

అయితే, ఉపాధికల్పన లేదా మహిళలు, దివ్యాంగుల ప్రవేశము లేదా సామాజికముగా మరియు ఆర్థికముగా వెనుకబడిన తరగతుల ప్రత్యేకించి అనుసూచిత కులములు మరియు అనుసూచిత జనజాతులకు చెందిన వ్యక్తుల కోసం సంస్థ ప్రత్యేక నిబంధనలు చేయుట నుండి ఈ పరిచ్ఛేదము నిరోధించునని భావించరాదు:

అంతేకాక, అట్టి ప్రతి సంస్థయు, కేంద్రీయ విద్యా సంస్థల (ప్రవేశములో రిజర్వేషను) చట్టము, 2006 (2007లోని 5వది) యొక్క ప్రయోజనముల నిమిత్తము కేంద్రీయ విద్యా సంస్థగా ఉండవలెను.

8. (1) ప్రతి సంస్థ న్యాయబద్ధ లాభదాయక సంస్థగా ఉండరాదు మరియు ఈ చట్టము క్రింద దాని కార్యకలాపములకు సంబంధించి అన్ని వ్యయములను భరించిన తరువాత సంస్థ రెవెన్యూలో ఏదైనా మిగులు ఉన్నట్లయితే, సంస్థ యొక్క వృద్ధి మరియు అభివృద్ధి లేదా అందులో పరిశోధనను నిర్వహించుటకు కానట్టి ఏదేని అవసరం కొరకు పెట్టుబడి పెట్టరాదు. సంస్థలు న్యాయబద్ధ లాభదాయక సంస్థలుగా ఉండకుండుట.

(2) ప్రతి సంస్థ తన స్వయం సమృద్ధికి మరియు నిర్వహణీయతకు అవసరమైన నిధులను సమకూర్చుటకు ప్రయత్నించవలెను.

9. ప్రతియొక సంస్థలో బోధన అంతయు ఇందు గురించి చేసిన పరినియమములు మరియు అధ్యాదేశముల ననుసరించి సంస్థ ద్వారా లేదా దాని పేరుతో నిర్వహించబడవలెను. సంస్థలలో బోధన.

## అధ్యాయము - III

## సంస్థల యొక్క ప్రాధికారులు

10. ఈ క్రిందివి సంస్థ యొక్క ప్రాధికార సంస్థలుగా ఉండవలెను, అవేవనగా:- సంస్థల ప్రాధికారులు.

(ఎ) పాలకమండలి;

(బి) సెనేట్; మరియు

(సి) సంస్థ యొక్క ప్రాధికారులుగా ఉండనగుటకు పరినియమముల ద్వారా ప్రఖ్యానము చేయబడినట్టి ఇతర ప్రాధికారులు.

11. (1) ప్రతి సంస్థ యొక్క పాలకమండలి, ముఖ్యకార్య నిర్వాహక నికాయముగా ఉండవలెను. పాలకమండలి.

(2) ప్రతి సంస్థ యొక్క బోర్డు ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:-

(ఎ) ఆహార పరిశ్రమ లేదా విద్యా లేదా ఆహార విజ్ఞాన శాస్త్రము లేదా ఆహార తయారీ ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానం లేదా నిర్వహణ లేదా అట్టి ఇతర రంగంలో ఘనత వహించిన ప్రసిద్ధ వ్యక్తుల నుండి ఒకరిని కేంద్ర ప్రభుత్వము ఛైర్‌పర్సన్‌గా నియమించును;

(బి) సంస్థ యొక్క డైరెక్టరు - పదవీరీత్యా సభ్యుడు;

(సి) భారతీయ ఆహార భద్రత మరియు ప్రమాణముల ప్రాధికార సంస్థ యొక్క ఛైర్‌పర్సన్ లేదా అతని నామనిర్దేశితుడు - పదవీరీత్యా సభ్యుడు;

(డి) భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ యొక్క డైరెక్టరు జనరలు; లేదా అతని నామనిర్దేశితుడు - పదవీరీత్యా సభ్యుడు;

(ఇ) ఆహార తయారీ ప్రక్రియ పరిశ్రమలతో వ్యవహరించు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ లేదా శాఖ యొక్క డైరెక్టరు హోదాకు తక్కువకాని ఒక ప్రతినిధి – పదవీరీత్యా సభ్యుడు;

(ఎఫ్) కేంద్ర ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడునట్టి, ఆహార తయారీ ప్రక్రియ పరిశ్రమ రంగంలో ప్రత్యేక పరిజ్ఞానము కలిగియున్న ఇద్దరు ప్రతినిధులు – సభ్యులు;

(జి) భారత నిర్వహణ సంస్థ నుండి ఒక ప్రతినిధి – పదవీరీత్యా సభ్యుడు;

(హెచ్) భారత సాంకేతిక సంస్థ నుండి ఒక ప్రతినిధి – పదవీరీత్యా సభ్యుడు;

(ఐ) ఎవరైనా ఉన్నయెడల సంస్థ యొక్క ఫ్యాకల్టీ డీన్ – పదవీరీత్యా సభ్యుడు;

(జె) భారత ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ యొక్క కార్యదర్శి లేదా అతని నామనిర్దేశితుడు – పదవీరీత్యా సభ్యుడు;

(కె) ప్రొఫెసర్లు, అసోసియేటు ప్రొఫెసర్లు మరియు అసిస్టెంటు ప్రొఫెసర్లలో నుండి సీనియారిటీ ప్రాతిపదికన సంస్థ యొక్క ముగ్గురు ఫ్యాకల్టీ సభ్యులు – పదవీరీత్యా సభ్యులు;

(ఎల్) సంబంధిత రాజ్య ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాకు తక్కువకాని ఒక నామనిర్దేశితుడు – పదవీరీత్యా సభ్యుడు;

(ఎమ్) సంస్థ యొక్క రిజిస్ట్రారు – పదవీరీత్యా సభ్య కార్యదర్శి.

(3) ఛైర్‌పర్సన్ బోర్డు యొక్క సభ్యులుకానట్టి నిపుణులను ఎంతమందినైనను బోర్డు సమావేశములకు హాజరగుటకు ఆహ్వానించు అధికారము కలిగి ఉండవలెను, అయితే అట్టి ఆహ్వానితులు సమావేశమునందు ఓటుచేయు హక్కును కలిగివుండరు.

బోర్డు యొక్క అధికారములు మరియు కృత్యములు.

12. (1) ఈ చట్టము యొక్క నిబంధనలకు అధ్యధీనమై ప్రతి సంస్థ యొక్క బోర్డు, సంస్థ యొక్క వ్యవహారముల సాధారణ అధీక్షణ, ఆదేశము మరియు నియంత్రణకు బాధ్యత వహించవలెను మరియు ఈ చట్టము, పరినియమములు మరియు అధ్యాదేశముల ద్వారా ఇతర విధముగా సమకూర్చబడని సంస్థ యొక్క అన్ని అధికారములను వినియోగించవలెను మరియు సెనేట్ యొక్క చర్యలను పునరీక్షించుటకు అధికారము కలిగి ఉండవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలకు భంగము వాటిల్లకుండా, ప్రతి సంస్థ యొక్క బోర్డు, ఈ క్రింది అధికారములను వినియోగించవలెను మరియు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) సంస్థ యొక్క పరిపాలన మరియు పని తీరుకు సంబంధించిన విధాన నిర్ణయ సమస్యలపై నిర్ణయము తీసుకొనుట;

(బి) సంస్థ యొక్క వార్షిక బడ్జెటు అంచనాలను పరిశీలించుట మరియు ఆమోదించుట;

(సి) సంస్థ యొక్క అభివృద్ధి కొరకైన ప్రణాళికను పరిశీలించుట మరియు ఆమోదించుట మరియు సదరు ప్రణాళికను అమలుపరచేందుకు ఆర్థిక వనరులను గుర్తించుట;

(డి) శాఖలు, ఫ్యాకల్టీలు లేదా అధ్యయన పాఠశాలలను స్థాపించుట మరియు సంస్థలో అధ్యయన కార్యక్రమములు లేదా కోర్సులను ప్రారంభించుట;

(ఇ) కేంద్ర ప్రభుత్వము యొక్క ఆమోదమును పొందిన తరువాత దేశములోపల ఆహార తయారీ ప్రక్రియ అధ్యయనాలు మరియు అనుబంధ రంగాల కేంద్రాలను ఏర్పాటు చేయుట;

(ఎఫ్) డిగ్రీలు, డిప్లొమాలు మరియు ఇతర విద్యా విషయిక విశిష్ఠతలు లేదా బిరుదులను మంజూరు చేయుట మరియు ఫెలోషిప్పులు, స్కాలరుషిప్పులు, బహుమతులు మరియు పతకములను ప్రారంభించుట మరియు వాటిని ప్రదానము చేయుట;

(జి) పరినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి రీతిలో గౌరవ డిగ్రీలను ప్రదానము చేయుట;

(హెచ్) గౌరవ పూర్వక అవార్డులు మరియు ఇతర విశిష్ఠతలను మంజూరు చేయుట;

(ఐ) విద్యా విషయిక, పరిపాలన, సాంకేతిక మరియు ఇతర పోస్టులను సృష్టించుట, అట్టి పదవులకు అర్హత మరియు వర్గీకరణ సర్వీసు నిబంధనలు మరియు షరతులు మరియు నియామక పద్ధతిని పరినియమముల ద్వారా నిర్ధారించుట;

(జె) ఆయా సమయములందు కేంద్ర ప్రభుత్వముచే నిబంధించబడునట్టి మార్గదర్శక సూత్రములను అనుసరించి మరియు విదేశములో తత్సమయమున అమలునందున్న శాసనములోని నిబంధనలను పురస్కరించుకొని భారతదేశానికి వెలుపల ఆహార తయారీ ప్రక్రియ అధ్యయన కేంద్రములను మరియు అనుబంధ రంగాల కేంద్రాలను ఏర్పాటు చేయుట;

(కె) పరినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి నిర్వహణ లక్ష్యముల ఆధారముగా సంస్థ యొక్క డైరెక్టరుకు పరివర్తనశీల వేతనమును నిర్ధారించి చెల్లించుట;

(ఎల్) పరినియమములను చేయుట, సవరించుట మరియు రద్దు చేయుట;

(ఎమ్) అధ్యాదేశములను పరిశీలించుట మరియు మార్పుచేయుట లేదా రద్దు చేయుట; మరియు

(ఎన్) ఈ చట్టము లేదా పరినియమముల ద్వారా దానికి ఒసగబడునట్టి లేదా ప్రత్యేకించబడినట్టి అట్టి ఇతర అధికారములను వినియోగించుట మరియు అట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుట.

(3) ఈ చట్టపు నిబంధనలకు అధ్యధీనమై బోర్డు తాను సముచితమని భావించినప్పుడు తన యొక్క అధికారములు మరియు కృత్యములను పరినియమముల ద్వారా డైరెక్టరుకు ప్రత్యాయోజనము చేయవచ్చును.

(4) సంస్థ యొక్క లక్ష్యాల సాధనకు సంబంధించి, డైరెక్టరు యొక్క పని తీరును బోర్డు వార్షికముగా పునర్విలోకనము చేయవలెను;

అయితే, బోర్డు ద్వారా నిర్ధారించబడునట్టి పరిమితులు నియతకాలిక మరియు ఉల్లేఖన నిబంధనలపై సంస్థ ఫ్యాకల్టీ సభ్యుల పని తీరు పునర్విలోకనము కూడా అట్టి పునరీక్షణలో చేరివుండవలెను.

(5) సంస్థ నిగమనము చేయబడిన తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధి లోపల మరియు అటు తరువాత ప్రతి మూడు సంవత్సరములలో కనీసము ఒకసారి బోర్డు ఒక స్వతంత్ర ఏజెన్సీ లేదా నిపుణుల బృందము ద్వారా, సంస్థ యొక్క దీర్ఘకాల పరిమితి వ్యూహం మరియు ప్రమాణాలపై మరియు బోర్డు నిర్ణయించునట్టి ఇతర ప్రమాణాలపై తన ఫ్యాకల్టీతో సహా సంస్థ యొక్క పని తీరును మదింపుచేసి, పునరీక్షించవలెను మరియు అట్టి పునరీక్షణ నివేదికను సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంచవలెను.

(6) ఉప-పరిచ్ఛేదము (5)లో పేర్కొనబడిన స్వతంత్ర ఏజెన్సీ లేదా నిపుణుల బృందము యొక్క అర్హతలు అనుభవము మరియు ఎంపిక తీరు, పరినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి విధముగా ఉండవలెను.

(7) ఉప-పరిచ్ఛేదము (5) క్రింద మదింపు మరియు పునరీక్షణ నివేదికను, దానిపై తీసుకొనిన చర్యల నివేదికతో పాటు బోర్డు కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించవలెను:

అయితే, కేంద్ర ప్రభుత్వము సదరు నివేదికను పరిశీలించిన మీదట, బోర్డు తీసుకొనవలసిన తదుపరి చర్యల విషయములో దానికి సూచనలు చేయవచ్చును.

(8) సంస్థ హితము దృష్ట్యా వెంటనే నిర్ణయము తీసుకొనవలసిన అత్యవసర పరిస్థితి ఉన్నదని ఛైర్‌పర్సన్ లేదా డైరెక్టరు అభిప్రాయపడినప్పుడు ఛైర్‌పర్సన్, డైరెక్టరుతో సంప్రదించి తన అభిప్రాయమునకు కారణములను నమోదు చేసిన తరువాత అవసరమైన ఉత్తరువులను జారీ చేయవచ్చును:

అయితే, అట్టి ఉత్తరువులను ధృవపరచు నిమిత్తము బోర్డు తదుపరి సమావేశమునందు దాఖలు చేయబడవలెను.

(9) బోర్డు, ఈ చట్టము క్రింద తన అధికారములను వినియోగించుటలోను మరియు తన కృత్యములను నిర్వర్తించుటలో కేంద్ర ప్రభుత్వమునకు జవాబుదారీగా ఉండవలెను మరియు విధాన నిర్ణయ విషయాలపై ప్రజాహితము దృష్ట్యా కేంద్ర ప్రభుత్వము, బోర్డుకు ఆదేశములను జారీచేయవచ్చును.

(10) బోర్డు, ఈ చట్టము క్రింద తన అధికారములను వినియోగించుటకు మరియు తన కృత్యములను నిర్వర్తించుటకు తాను అవసరమని భావించునట్టి కమిటీలను నియమించుటకు అధికారము కలిగి ఉండవలెను.

బోర్డు యొక్క సభ్యుల పదవీకాలము, వారి పదవులయందలి ఖాళీలు మరియు వారికి చెల్లించదగు భత్యములు.

13. (1) ఈ పరిచ్ఛేదములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, పదవీరీత్యా సభ్యుడుకాని, ఛైర్‌పర్సన్ లేదా సభ్యుని పదవీకాలము అతని నియామకము లేదా నామనిర్దేశపు తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధిపాటు ఉండవలెను.

(2) పదవీరీత్యా సభ్యుడైన వ్యక్తి పదవీకాలము ఆయన బోర్డు యొక్క సభ్యునిగా ఉన్న కారణంగా, ఆయన పదవిని నిర్వహించినంత కాలము కొనసాగవలెను.

(3) ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికిని, పదవీరీత్యా సభ్యుడు కానట్టి విరమించు సభ్యుడు కౌన్సిల్ ఇతర విధముగా ఆదేశించిననే తప్ప, అతని స్థానములో మరొక వ్యక్తి సభ్యునిగా నామనిర్దేశము చేయబడునంతవరకు లేదా ఆరు మాసములు ముగియునంతవరకు లేదా వీటిలో ఏది ముందు అయితే అంతవరకు పదవిలో కొనసాగవలెను.

(4) పదవీరీత్యా సభ్యుడుకానట్టి, బోర్డు యొక్క సభ్యులు పరినియముల ద్వారా నిబంధించబడునట్టి భత్యములు పొందుటకు హక్కు కలిగి ఉండవలెను.

ఆకస్మిక ఖాళీల భర్తీ.

14. తొలగింపు, రాజీనామా, మరణము లేదా ఇతర విధముగా ఛైర్‌పర్సన్ లేదా సభ్యుని పదవికి ఏదేని ఖాళీ ఏర్పడినపుడు, 11వ పరిచ్ఛేదపు నిబంధనల ననుసరించి అట్టి ఖాళీ ఏర్పడిన తేదీ నుండి ఆరు మాసముల కాలావధి లోపల సదరు ఖాళీని భర్తీ చేయవలెను.

సభ్యుల రాజీనామా.

15. పదవీ రీత్యా సభ్యుడు కానట్టి ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడు కేంద్ర ప్రభుత్వమునకు తన సొంత దస్తూరీతో వ్రాతపూర్వకమైన నోటీసు పంపడం ద్వారా తన పదవికి రాజీనామా చేయవచ్చును:

అయితే, పదవీరీత్యా సభ్యుడుకానట్టి ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడు, పదవిని వెంటనే విడిచిపెట్టవలెనని కేంద్ర ప్రభుత్వము అనుమతించిననే తప్ప, అట్టి నోటీసు అందిన తేదీ నుండి ఆరు మాసములు ముగియువరకు లేదా అతని స్థానములో అతని ఉత్తరదాయిగా మరొక వ్యక్తి తగు రీతిగా నియమించబడునంతవరకు లేదా అతని పదవీకాలము ముగియునంత వరకు, వాటిలో ఏది ముందు అయితే అంతవరకు తన పదవిలో కొనసాగవలెను.

సెనేట్.

16. (1) ఈ క్రింది వ్యక్తులతో కూడినట్టి సెనేట్ సంస్థ యొక్క ప్రధాన విద్యా విషయిక నికాయముగా ఉండవలెను, వారెవరనగా:–

| | | |
|---|---|---|
| (ఎ) డైరెక్టరు | – | ఛైర్‌పర్సన్, పదవీరీత్యా; |
| (బి) రిజిస్ట్రారు | – | సభ్యుడు, పదవీరీత్యా; |

(సి) సంస్థలో ఉపదేశాలు బోధించు నిమిత్తము సంస్థచే నియమించబడిన లేదా గుర్తించబడిన ప్రొఫెసర్ల స్థాయిలో పూర్తికాలిక ఫ్యాకల్టీ వ్యక్తులందరు - పదవీరీత్యా సభ్యులు;

(డి) ఆహార విజ్ఞాన శాస్త్రము, నిర్వహణ మరియు ఆహార పదార్థ సాంకేతికత రంగాలలో నుండి ఒక్కొక్కరు చొప్పున సంస్థలో ఉద్యోగులు కానట్టి ప్రసిద్ధిగాంచిన విద్యావేత్తలలో నుండి ముగ్గురు వ్యక్తులను డైరెక్టరుతో సంప్రదించి బోర్డుచే నామనిర్దేశం చేయబడవలెను - సభ్యులు; మరియు

(ఇ) పరినియమముల ద్వారా నిబంధించబడునట్టి సంస్థ యొక్క ఇతర సభ్యులు - సభ్యులు పదవీరీత్యా.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (డి) క్రింద, నామనిర్దేశము చేయబడిన సభ్యుని పదవీకాలము, అతని నామనిర్దేశపు తేదీ నుండి రెండు సంవత్సరముల పాటు ఉండవలెను.

(3) పదవీరీత్యా సభ్యుని పదవీ కాలము, అతను సభ్యుడుగా ఉన్న కారణము రీత్యా అతను పదవిలో ఉన్నంతకాలం కొనసాగవలెను.

సెనేట్ యొక్క కృత్యములు.

17. ఈ చట్టపు నిబంధనలు పరినియమములు మరియు అధ్యాదేశములకు అధ్యధీనమై సంస్థ యొక్క సెనేట్, నియంత్రణ మరియు సాధారణ క్రమబద్ధమును కలిగి ఉండవలెను మరియు సంస్థలో ఉపదేశము, విద్య మరియు పరీక్షల యొక్క ప్రమాణముల నిర్వహణకు బాధ్యత వహించవలెను మరియు పరినియమముల ద్వారా దానికి ఒసగబడిన లేదా దానికి అప్పగించబడిన ఇతర అధికారములను వినియోగించవలెను మరియు అట్టి ఇతర కృత్యములను నిర్వర్తించవలెను.

ఛైర్‌పర్సన్ యొక్క అధికారములు మరియు కృత్యములు.

18. (1) ఛైర్‌పర్సన్, సాధారణముగా బోర్డు సమావేశములకు మరియు సంస్థ యొక్క స్నాతకోత్సవములకు అధ్యక్షత వహించవలెను.

(2) బోర్డు తీసుకొనిన నిర్ణయములను అమలుపరచుట ఛైర్‌పర్సన్ యొక్క కర్తవ్యమై ఉండవలెను.

(3) ఛైర్‌పర్సన్ ఈ చట్టము లేదా పరినియమముల ద్వారా తనకు ఒసగబడిన లేదా తనకు అప్పగించబడిన అట్టి ఇతర అధికారములను వినియోగించవలెను మరియు అట్టి ఇతర కృత్యములను నిర్వర్తించవలెను.

డైరెక్టరు.

19. (1) డైరెక్టరు, బోర్డుచే నియమించబడవలెను.

(2) డైరెక్టరు, సంస్థ యొక్క ప్రధాన విద్యా విషయిక మరియు కార్యనిర్వాహక అధికారిగా ఉండవలెను మరియు సంస్థ యొక్క సక్రమ పాలనకు మరియు ఉపదేశమును బోధించుటకు మరియు అందలి క్రమశిక్షణ నిర్వహణకు బాధ్యత వహించవలెను.

(3) డైరెక్టరు, వార్షిక నివేదికలను మరియు లెక్కలను బోర్డుకు సమర్పించవలెను.

(4) డైరెక్టరు, ఈ చట్టము లేదా పరినియమములు లేదా అధ్యాదేశముల ద్వారా ఆయనకు ఒసగబడినట్టి లేదా అప్పగించబడునట్టి ఇతర అధికారములను వినియోగించవలెను మరియు ఆయన ఇతర కృత్యములను నిర్వర్తించవలెను.

రిజిస్ట్రారు.

20. (1) ప్రతి సంస్థ యొక్క రిజిస్ట్రారు, పరినియమముల ద్వారా నిబంధించబడునట్టి అట్టి నిబంధనలు మరియు షరతులపై నియమించబడవలెను మరియు సంస్థ యొక్క రికార్డులకు, సామాన్య మోహరుకు మరియు నిధులకు మరియు బోర్డు ఆయనకు అప్పగించబడినట్టి సంస్థ యొక్క ఇతర ఆస్తికి ఆయన అభిరక్షకుడిగా ఉండవలెను.

(2) రిజిస్ట్రారు, పరినియమముల ద్వారా విహితపరచబడునట్టి విధముగా బోర్డు, సెనేట్ మరియు అట్టి కమిటీలకు కార్యదర్శిగా వ్యవహరించవలెను.

(3) రిజిస్ట్రారు తన కృత్యములను సక్రమముగా నిర్వర్తించుటలో డైరెక్టరుకు బాధ్యత వహించవలెను.

(4) రిజిస్ట్రారు, ఈ చట్టము లేదా పరినియమములు లేదా డైరెక్టరు ద్వారా ఆయనకు ఒసగబడిన లేదా ఆయనకు అప్పగించబడినట్టి ఇతర అధికారములను వినియోగించవలెను మరియు అట్టి కృత్యములను నిర్వర్తించవలెను.

ఇతర ప్రాధికారులు మరియు అధికారులు.

21. పైన పేర్కొనబడనట్టి ఇతర ప్రాధికారులు మరియు అధికారుల యొక్క అధికారములు మరియు కృత్యములు, పరినియమముల ద్వారా నిర్ధారించబడునట్టి విధముగా ఉండవలెను.

నియామకములు.

22. ప్రతి సంస్థ యొక్క సిబ్బంది తాలూకు అన్ని నియామకములు, పరినియమములలో నిబంధించబడినట్టి ప్రక్రియ ననుసరించి, చేయబడవలెను–

(ఎ) విద్యా విషయిక సిబ్బందిలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ లేదా అంతకు పైబడిన స్థాయి పోస్టులకు లేదా విద్యాయేతర సిబ్బందిలో 7వ స్థాయికి పైబడిన వేతన మాత్రిక ఉన్న పోస్టుకు బోర్డు ద్వారా నియామకము.

(బి) ఏదేని ఇతర పదవి విషయములో డైరెక్టరు.

పరినియమములు.

23. ఈ చట్టపు నిబంధనలకు అధ్యధీనమై, ఈ క్రింది అన్నింటిని లేదా ఏవేని ఈ క్రింది విషయాలను పరినియమములు నిబంధించును, అవేవనగా:-

(ఎ) గౌరవ డిగ్రీలు ప్రదానము చేయుట;

(బి) బోధన శాఖల రూపకల్పన;

(సి) సంస్థలోని అధ్యయన కోర్సులకు మరియు సంస్థ యొక్క డిగ్రీలు మరియు డిప్లొమాల ప్రవేశ పరీక్షల కొరకు విధించబడు రుసుములు;

(డి) ఫెలోషిప్పులు, స్కాలరుషిప్పులు, ప్రదర్శనలు, పతకములు మరియు బహుమతులను ఏర్పాటు చేయుటకు;

(ఇ) విద్యా విషయిక, పరిపాలనపరమైన, సాంకేతిక మరియు ఇతర పోస్టులకు అర్హతలు, వర్గీకరణ, సర్వీసు నిబంధనలు మరియు షరతులు మరియు నియామక పద్ధతి;

(ఎఫ్) సంస్థ యొక్క అధికారులు, ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది ప్రయోజనము కొరకు పింఛను, బీమా మరియు భవిష్య నిధుల ఏర్పాటు;

(జి) సంస్థ యొక్క ప్రాధికార సంస్థల ఏర్పాటు, అధికారములు మరియు కృత్యములు;

(హెచ్) హాళ్లు, మరియు వసతి గృహముల స్థాపన మరియు వాటి నిర్వహణ;

(ఐ) సంస్థ యొక్క విద్యార్థుల నివాసము కొరకు షరతులు మరియు హాళ్లు మరియు వసతి గృహములలో నివాసము కొరకు విధించబడు రుసుములు మరియు ఇతర ఛార్జీలు;

(జె) బోర్డు సభ్యుల ఖాళీలను భర్తీచేయు రీతి;

(కె) బోర్డు యొక్క ఛైర్‌పర్సన్ మరియు సభ్యులకు చెల్లించబడదగు భత్యములు;

(ఎల్) బోర్డు యొక్క ఉత్తరువులు మరియు నిర్ణయముల అధిప్రమాణీకరణ;

(ఎమ్) సంస్థకు ఆర్థిక జవాబుదారీగా ఉండుట;

(ఎన్) బోర్డు, సెనేట్ లేదా ఏదేని కమిటీ సమావేశములకు మరియు అట్టి సమావేశమునకు కోరమ్ మరియు వాటి వ్యవహార నిర్వహణలో అనుసరించదగు ప్రక్రియ;

(ఓ) పరినియమముల ద్వారా నిర్దిష్టపరచబడు లేదా ఈ చట్టము ద్వారా ఆవశ్యకమగు ఏదేని ఇతర విషయము;

పరినియమములు చేయు రీతి.

24. (1) కేంద్ర ప్రభుత్వ పూర్వ ఆమోదముతో కౌన్సిలు ద్వారా, ప్రతి సంస్థ యొక్క మొదటి పరినియమములు రూపొందించబడవలెను మరియు వాటిని చేసిన తరువాత వాటి యొక్క ప్రతిని సాధ్యమైనంత త్వరగా పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టబడవలెను.

(2) బోర్డు ఆయా సమయములందు, కొత్త లేదా అదనపు పరినియమములను చేయవచ్చును లేదా ఈ పరిచ్ఛేదములో ఇటు తరువాత నిబంధించబడునట్టి రీతిలో సదరు పరినియమములను మార్పు చేయవచ్చును లేదా రద్దు చేయవచ్చును.

(3) ప్రతి కొత్త పరినియమము, పరినియమములకు అదనముగా చేర్చుట లేదా పరినియమములకు ఏదేని మార్పు లేదా రద్దుకు కేంద్ర ప్రభుత్వము యొక్క పూర్వ ఆమోదమును పొందవలెను, దానిని ఆమోదించవచ్చును లేదా పరిశీలన నిమిత్తము బోర్డుకు తిరిగి పంపవచ్చును.

(4) కొత్త పరినియమము లేదా పరినియమమునకు సవరణ లేదా ప్రస్తుతమున్న పరినియమము రద్దుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదము పొందిననే తప్ప, శాసనమాన్యతను కలిగి ఉండదు.

25. ఈ చట్టపు నిబంధనలు మరియు పరినియమములు, అధ్యధీనమై అధ్యాదేశములకు అధ్యధీనమై ఈ క్రింది అన్నీ లేదా ఏవేని విషయములను నిబంధించవచ్చును, అవేవనగా:- అధ్యాదేశములు.

(ఎ) సంస్థలో విద్యార్థుల ప్రవేశము;

(బి) సంస్థ యొక్క అన్ని డిగ్రీలు మరియు డిప్లొమాల కొరకు ఉంచదగు అధ్యయన కోర్సులు;

(సి) డిగ్రీ లేదా డిప్లొమో కోర్సులలో విద్యార్థుల ప్రవేశమునకు మరియు సంస్థ పరీక్షలకు, మరియు డిగ్రీలు మరియు డిప్లొమాల అర్హతకు నిబంధనలు;

(డి) ఫెలోషిప్పులు, స్కాలరుషిప్పులు, ప్రదర్శనలు, పతకములు మరియు బహుమతుల ప్రదానమునకు నిబంధనలు;

(ఇ) పరీక్షా నికాయములు, పరీక్షకులు మరియు పరిశీలకుల యొక్క నియామకపు షరతులు మరియు పద్ధతి;

(ఎఫ్) పరీక్షల నిర్వహణ;

(జి) సంస్థ యొక్క విద్యార్థులలో క్రమశిక్షణ నిర్వహణ;

(హెచ్) ఈ చట్టము లేదా పరినియమముల ద్వారా అధ్యాదేశముల కొరకు నిబంధించబడు లేదా నిబంధించే ఏదేని ఇతర విషయము.

26. (1) ఈ పరిచ్ఛేదములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, అధ్యాదేశములు సెనేట్ ద్వారా చేయబడవలెను. అధ్యాదేశములు చేయు పద్ధతి.

(2) సెనేట్ ద్వారా చేయబడిన అన్ని అధ్యాదేశములు, అది నిర్దేశించునట్టి తేదీ నుండి అమలు ప్రభావమును కలిగి ఉండవలెను, అయితే, ఆ విధంగా చేయబడిన ప్రతి అధ్యాదేశము, అది చేయబడిన తరువాత వెంటనే, బోర్డుకు సమర్పించబడవలెను మరియు బోర్డు తన తదుపరి సమావేశములో దానిని పరిశీలించవలెను.

(3) బోర్డు, తీర్మానము ద్వారా ఏదేని అధ్యాదేశమును మార్పు చేయుటకు లేదా రద్దు చేయుటకు అధికారము కలిగి ఉండవలెను మరియు అట్టి అధ్యాదేశమును అట్టి తీర్మానపు తేదీ నుండి తదనుసారముగా మార్పు చేయబడవలెను లేదా సందర్భానుసారము రద్దు కావలెను.

27. (1) సంస్థ మరియు దాని ఉద్యోగుల మధ్య ఒప్పందం వలన ఉత్పన్నమయ్యే ఏదేని వివాదమును, సంబంధిత ఉద్యోగి అభ్యర్థనపై లేదా సంస్థ కోరిన మీదట సంస్థ ద్వారా నియమించబడిన ఒక సభ్యుడు, సంబంధిత ఉద్యోగి ద్వారా నామనిర్దేశము చేయబడిన ఒక సభ్యుడు మరియు కేంద్ర ప్రభుత్వము ద్వారా నియమించబడినట్టి మధ్యవర్తితో కూడినట్టి మధ్యవర్తిత్వ ట్రిబ్యునలుకు నిర్దేశించవలెను. మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్.

(2) మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్ యొక్క నిర్ణయము అంతిమమైనదై ఉండవలెను మరియు సదరు ట్రిబ్యునల్ ద్వారా నిర్ణయించబడిన విషయములకు సంబంధించి ఏ సివిలు న్యాయస్థానములోను ఎట్టి దావా వేయబడరాదు:

అయితే, ఈ పరిచ్ఛేదములో ఉన్నదేదియు సదరు ఉద్యోగిని లేదా సందర్భానుసారము సంస్థను, సంవిధానము యొక్క 32వ మరియు 226వ అనుచ్ఛేదముల క్రింద లభ్యమైన న్యాయిక ప్రత్యుపాయములను పొందుట నుండి నివారించజాలదు.

(3) మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్, తన సొంత ప్రక్రియను క్రమబద్ధము చేసుకొనుటకు అధికారమును కలిగి ఉండవలెను.

(4) మధ్యవర్తిత్వమునకు సంబంధించి, తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనములో ఉన్నదేదియు, ఈ పరిచ్ఛేదము క్రింద మధ్యవర్తిత్వములకు వర్తించరాదు.

## అధ్యాయము – IV

## కౌన్సిల్

కౌన్సిల్ స్థాపన.

28. (1) ఈ విషయములో, కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నిర్దిష్టపరచబడునట్టి తేదీ నుండి కౌన్సిల్ అని పిలువబడు ఒక కేంద్ర నికాయము స్థాపించబడవలెను.

(2) కౌన్సిల్, ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:-

| | | |
|---|---|---|
| (ఎ) కేంద్ర ప్రభుత్వ, ఆహార తయారీ ప్రక్రియ పరిశ్రమలకు ఆధిపత్యము వహించు మంత్రి. | – | ఛైర్‌పర్సన్, పదవీరీత్యా; |
| (బి) కేంద్ర ప్రభుత్వ ఆహార తయారీ ప్రక్రియ పరిశ్రమల సహాయ మంత్రి | – | సభ్యుడు, పదవీరీత్యా; |
| (సి) భారత, ఆహార భద్రత ప్రమాణముల ప్రాధికార సంస్థ, ఛైర్‌పర్సన్ | – | సభ్యుడు, పదవీరీత్యా; |
| (డి) ఆర్థిక విషయములను పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ లేదా శాఖకు ఆధిపత్యము వహించే భారత ప్రభుత్వ కార్యదర్శి. | – | సభ్యుడు, పదవీరీత్యా; |
| (ఇ) భారత రూపాంతరీకరణ జాతీయ సంస్థ యొక్క ముఖ్య కార్యనిర్వహణ అధికారి | – | సభ్యుడు, పదవీరీత్యా; |
| (ఎఫ్) ఉన్నత విద్య వ్యవహారములను పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ లేదా శాఖకు ఆధిపత్యము వహించే భారత ప్రభుత్వ కార్యదర్శి | – | సభ్యుడు, పదవీరీత్యా; |
| (జి) ఆహార తయారీ ప్రక్రియ పరిశ్రమ నుండి కౌన్సిల్ ఛైర్‌పర్సన్ ద్వారా నామనిర్దేశము చేయబడు పేరు ప్రతిష్టలు గల ముగ్గురు ప్రతినిధులు | – | సభ్యులు; |

(హెచ్) ఆహార తయారీ ప్రక్రియ రంగములో తమ వంతు
సహాయ సహకారములను అందించినట్టి,
పేరు ప్రతిష్టలు గల ముగ్గురు విద్యావేత్తలు
కౌన్సిల్ యొక్క ఛైర్‌పర్సన్ ద్వారా
నామనిర్దేశము చేయబడుదురు - సభ్యులు;

(ఐ) లోక్‌సభ ద్వారా ఎన్నుకొనబడిన సభ్యులు
ఇద్దరు మరియు రాజ్యసభ నుండి
ఎన్నుకొనబడిన సభ్యుడు ఒకరు చొప్పున,
ముగ్గురు పార్లమెంటు సభ్యులు . - సభ్యులు:

అయితే, కౌన్సిల్ యొక్క సభ్యుని పదవికి ఎన్నుకొనబడినందుకు మరియు పార్లమెంటు యొక్క ఏ సభలోనైన సభ్యునిగా ఉండుట వలన అతనిని అనర్హునిగా చేయరాదు;

(జె) ఆహార తయారీ ప్రక్రియ పరిశ్రమల
వ్యవహారములను పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ
మంత్రిత్వశాఖకు ఆధిపత్యము వహించే,
భారత ప్రభుత్వ కార్యదర్శి - సభ్య కార్యదర్శి,
పదవీ రీత్యా.

(3) కేంద్ర ప్రభుత్వము సభ్యులలో ఒకరిని ఉత్తరువు ద్వారా కౌన్సిలు యొక్క వైస్-ఛైర్‌పర్సన్‌గా పేర్కొనవచ్చును.

కౌన్సిల్ సభ్యుల పదవీకాలము, వారి పదవులయందలి ఖాళీలు మరియు వారికి చెల్లించదగు భత్యములు.

29. (1) ఈ పరిచ్ఛేదములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, పదవీరీత్యా సభ్యులుకాని, కౌన్సిల్ యొక్క సభ్యుల పదవీకాలము, అతని నామనిర్దేశపు తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధి పాటు ఉండవలెను:

అయితే, 28వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (i)లో పేర్కొనబడినట్టి సభ్యుని పదవీకాలము, సదరు సభ్యుడు మంత్రి లేదా సహాయమంత్రి లేదా ఉపమంత్రి లేదా సభాపతి లేదా ఉప సభాపతి లేదా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ అయిన వెనువెంటనే పరిసమాప్తి కావలెను లేదా ఆయన ఎన్నుకొనబడిన సభ నుండి సభ్యుడుగా విరమించిన తక్షణమే సమాప్తికావలెను.

(2) పదవీరీత్యా సభ్యుడైనట్టి వారి పదవీకాలము, ఆయన సభ్యుడుగా ఉన్నంత కాలావధిపాటు పదవిలో కొనసాగవలెను.

(3) 28వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండములు (జి) మరియు (హెచ్)లలో పేర్కొనబడిన కౌన్సిలు యొక్క సభ్యులు, కేంద్ర ప్రభుత్వము యొక్క అభీష్టము ఉన్నంతమేరకు పదవిని కలిగి ఉండవలెను.

(4) పదవీరీత్యా సభ్యుడుకాని కౌన్సిలు యొక్క సభ్యుని పదవిలో ఏర్పడిన ఖాళీని విహితపరచబడునట్టి రీతిలో భర్తీ చేయవలెను.

(5) ఆకస్మిక ఖాళీని భర్తీ చేయడానికి నామనిర్దేశము చేయబడిన సభ్యుని పదవీ కాలము అతడు ఆ విధముగా ఎవరి స్థానములో నామనిర్దేశము చేయబడినాడో ఆ సభ్యుని మిగిలిన కాలావధిపాటు కొనసాగవలెను.

(6) ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికినీ, పదవీరీత్యా సభ్యుడు కానట్టి నిష్క్రమణ సభ్యుడు, కేంద్ర ప్రభుత్వము ఇతర విధముగా ఆదేశించిననే తప్ప, అతని స్థానములో సభ్యునిగా మరొక వ్యక్తి నామనిర్దేశము చేయబడునంత వరకు లేదా ఆరు మాసములు ముగియునంతవరకు, వీటిలో ఏది ముందు అయితే అంతవరకు పదవిలో కొనసాగవలెను.

(7) పదవీరీత్యా సభ్యులుకాని, కౌన్సిల్ యొక్క సభ్యులకు పరినియమముల ద్వారా నిబంధించబడునట్టి ప్రయాణ మరియు ఇతర భత్యములను చెల్లించవలెను.

(8) పదవీరీత్యా సభ్యుడుకాని, కౌన్సిల్ యొక్క సభ్యుడు, విహితపరచబడునట్టి పరిస్థితులలో మరియు అట్టి రీతిలో, కేంద్ర ప్రభుత్వము అతనిని పదవి నుండి తొలగించవచ్చును.

కౌన్సిల్ యొక్క కృత్యములు.

30. (1) అన్ని సంస్థల కార్యకలాపములను సమన్వయపరచుట మరియు సంస్థల పనితీరును పెంపొందించే ఉద్దేశ్యంతో వాటి యొక్క అనుభవములు, అభిప్రాయములు మరియు సంబంధములను పంచుకొనేందుకు మార్గమును సుగమం చేయుట కౌన్సిల్ యొక్క సాధారణ కృత్యమై ఉండవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలకు భంగము వాటిల్లకుండా కౌన్సిల్, ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అవేవనగా:-

(ఎ) సంస్థల నిర్వహణకు విశాల దృక్పధముతో విధానాన్ని రూపొందించుట;

(బి) అనుసూచిత కులములు, అనుసూచిత జనజాతులు మరియు పౌరులలో సామాజికంగా మరియు విద్యాపరంగాను ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల ప్రయోజనార్థము, పరిశోధనతో పాటు, స్కాలరుషిప్పులు ప్రవేశ పెట్టేందుకు, కేంద్ర ప్రభుత్వమునకు సిఫారసుచేయుట;

(సి) ఒక సంస్థ ద్వారా, దానికి నిర్దేశించబడునట్టి సంస్థల యొక్క ఉమ్మడి హితములకు సంబంధించినట్టి విషయములలో పర్యాలోచనలు జరుపుట;

(డి) సంస్థల పనితీరును సమన్వయపరచేందుకు మరియు సహకారము సమకూర్చేందుకు అవసరమైన చర్యలను పెంపొందించుట;

(ఇ) విధానపరమైన లక్ష్యముల సాధనను పునరీక్షించుట; మరియు

(ఎఫ్) విహితపరచబడునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుట.

కౌన్సిల్ యొక్క సమావేశములు.

31. కౌన్సిల్ విహితపరచబడునట్టి సమయము మరియు స్థలములో సమావేశమగును మరియు దాని సమావేశములలో అట్టి కార్యపద్ధతి (అట్టి సమావేశములలో కోరమ్‌తో సహా)ని పాటించును.

# అధ్యాయము - V

## ఆర్థిక, లెక్కలు మరియు ఆడిట్

32. ఈ చట్టము క్రింద సంస్థలు సమర్థవంతముగా తమ కృత్యములను నిర్వర్తించేందుకు వీలు కల్పించే నిమిత్తం ఈ విషయములో పార్లమెంటు శాసనము ద్వారా తగురీతిగా వినియోజనము చేసిన మీదట, కేంద్ర ప్రభుత్వము, తాను ఉచితమని తలచునట్టి రీతిలో ప్రతి ఆర్థిక సంవత్సరములో అట్టి ద్రవ్యపు మొత్తములను ప్రతి సంస్థకు చెల్లించును. కేంద్ర ప్రభుత్వము ద్వారా అనుదానములు.

33. (1) ప్రతి సంస్థ, ఈ క్రింది వాటిని, అనగా,- సంస్థ యొక్క నిధులు.

(ఎ) కేంద్ర ప్రభుత్వము ద్వారా సమకూర్చబడు అన్ని ద్రవ్యములు;

(బి) సంస్థ ద్వారా స్వీకరించబడు అన్ని రుసుములు మరియు ఇతర ఛార్జీలు;

(సి) సంస్థ అనుదానములు, బహుమతులు, విరాళములు, దానములు, వీలునామా ఆస్తులు లేదా బదిలీల ద్వారా స్వీకరించిన అన్ని ద్రవ్యములు;

(డి) ఏదేని ఇతర వనరు నుండి లేదా ఏదేని ఇతర రీతిలో సంస్థ ద్వారా స్వీకరించబడిన అన్ని ద్రవ్యములు,

- జమచేయుటకు ఒక నిధిని నిర్వహించవలెను.

(2) ప్రతి సంస్థ యొక్క నిధికి జమ చేయబడిన అన్ని ద్రవ్యములు, బోర్డు ఆమోదముతో సంస్థ నిర్ణయించునట్టి బ్యాంకులలో జమ చేయవలెను లేదా అట్టి రీతిలో పెట్టుబడి పెట్టవలెను.

(3) ప్రతి సంస్థ యొక్క నిధిని, ఈ చట్టము క్రింద సంస్థ తన అధికారములను వినియోగించుటకు మరియు తన కృత్యములను నిర్వర్తించుటకు చేసిన వ్యయములతో పాటు, సంస్థ యొక్క ఇతర వ్యయములను భరించుటకు వర్తింపజేయవలెను.

34. (1) ప్రతి సంస్థ సక్రమమైన లెక్కలను మరియు ఇతర సంగత రికార్డులను నిర్వహించవలెను మరియు భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుతో సంప్రదించి, కేంద్ర ప్రభుత్వము ద్వారా విహితపరచబడినట్టి ప్రరూపములో మరియు అట్టి రీతిలో, ఆస్తి అప్పుల పట్టికతో సహా లెక్కల వార్షిక వివరణను తయారుచేయవలెను. లెక్కలు మరియు ఆడిట్.

(2) ప్రతి సంస్థ యొక్క లెక్కలు భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు ద్వారా ఆడిట్ చేయించబడవలెను మరియు అట్టి ఆడిట్‌కు సంబంధించి అయిన ఏదేని ఖర్చు, సంస్థ ద్వారా భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలుకు చెల్లించబడవలెను.

(3) ఏదేని సంస్థ యొక్క లెక్కలను ఆడిట్ చేయుటకు సంబంధించి భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు మరియు ఆయనచే నియమించబడిన ఎవరేని వ్యక్తి, ప్రభుత్వ లెక్కల ఆడిట్‌కు సంబంధించి భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు కలిగి ఉండే అవే హక్కులు, విశేషాధికారములు మరియు ప్రాధికారమును కలిగి ఉండవలెను మరియు ప్రత్యేకముగా పుస్తకములు, లెక్కలు, సంబంధిత ఓచర్లు మరియు ఇతర పత్రములను సమర్పించవలసినదని కోరుటకు మరియు సంస్థ యొక్క కార్యాలయములను తనిఖీ చేయుటకు హక్కు కలిగి ఉండవలెను.

(4) భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేదా ఈ విషయములో ఆయనచే నియమించబడిన ఎవరేని ఇతర వ్యక్తి, దానిపై ఆడిట్ నివేదికతో పాటు వార్షికముగా కేంద్ర ప్రభుత్వమునకు సమర్పించవలెను మరియు ఆ ప్రభుత్వము, కేంద్ర ప్రభుత్వము ద్వారా నిబంధించబడునట్టి ప్రక్రియ ననుసరించి, పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టవలెను.

పింఛను, బీమా మరియు భవిష్య నిధులు.

35. (1) డైరెక్టరుతో పాటు ప్రతి సంస్థ తన ఉద్యోగుల ప్రయోజనము కొరకు, పరినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి షరతులకు అధ్యధీనమై మరియు రీతిలో, తాను ఉచితమని భావించునట్టి విధముగా అట్టి పింఛను, బీమా మరియు భవిష్య నిధులను ఏర్పాటు చేయవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనబడినట్టి భవిష్యనిధి ఏర్పాటు చేయబడినపుడు, అది ప్రభుత్వ భవిష్య నిధిగానే, భవిష్య నిధుల చట్టము, 1925 (1925లోని 19వది) నిబంధనలు వర్తించవలెనని కేంద్ర ప్రభుత్వము ప్రఖ్యానము చేయవచ్చును.

## అధ్యాయము - VI

## వివిధ విషయములు

ఖాళీలు మొదలైన వాటి వలన, చట్టములు మరియు శాసనిక చర్యలు శాసనమాన్యత లేనివిగా ఉండకుండుట.

36. కౌన్సిలు లేదా ఏదేని సంస్థ లేదా బోర్డు లేదా సెనేట్ లేదా ఈ చట్టము క్రింద ఏర్పాటు చేయబడిన ఏదేని ఇతర కమిటీ యొక్క ఏ చర్యయు ఈ క్రింది కారణముల వలన మాత్రమే శాసనమాన్యతను కోల్పోరాదు, అవేవనగా:-

(ఎ) వాటి ఏర్పాటులో ఏదేని ఖాళీ లేదా లోపము; లేదా

(బి) దాని యొక్క సభ్యునిగా వ్యవహరించు వ్యక్తి యొక్క నామనిర్దేశము లేదా నియామకము విషయములో ఏదేని క్రమరాహిత్యత; లేదా

(సి) కేసు యొక్క అర్హతపై వ్యతిరేక ప్రభావము చూపగలిగే విధముగా దాని ప్రకియలో ఏదేని క్రమరాహిత్యము వలన.

సద్భావముతో తీసుకొనిన చర్యకు రక్షణ.

37. ఈ చట్టము, పరినియమములు లేదా అధ్యాదేశముల యొక్క నిబంధనలను పురస్కరించుకొని, సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైనను, సంస్థ యొక్క ఛైర్‌పర్సన్ లేదా బోర్డు సభ్యులు లేదా బోర్డు సెనేట్ లేదా కౌన్సిలు లేదా ఎవరేని అధికారి లేదా ఉద్యోగిపై ఎట్టి దావా, అభియోగము లేదా ఏదేని శాసనిక చర్య ఉండరాదు.

నియమములు చేయుటకు అధికారము.

38. (1) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచేందుకు కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకముగా మరియు పైన పేర్కొనబడిన అధికారముల సాధారణతకు భంగము వాటిల్లకుండా అట్టి నియమములు ఈ క్రింది అన్నీ లేదా వాటిలోని ఏవేని కొన్ని విషయములను నిబంధించవచ్చును, అవేవనగా:-

(ఎ) 29వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద ఖాళీని భర్తీచేయు రీతి;

(బి) 29వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (8) క్రింద కౌన్సిలు యొక్క సభ్యుని పదవి నుండి తొలగించుటకు అవసరమైన పరిస్థితులు మరియు రీతి;

(సి) 30వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఎఫ్) క్రింద కౌన్సిలు యొక్క ఇతర కృత్యములు;

(డి) 31వ పరిచ్ఛేదము క్రింద కౌన్సిలు యొక్క సమావేశపు సమయము మరియు స్థలము, దాని యొక్క కోరమ్ మరియు వ్యవహార నిర్వహణ ప్రక్రియ;

(ఇ) 34వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద తయారుచేయబడు ఆస్తి అప్పుల పట్టిక సహా, లెక్కల వార్షిక వివరణ యొక్క ప్రరూపము మరియు రీతి; మరియు

(ఎఫ్) విహితపరచబడునట్టి లేదా కోరబడునట్టి ఏదేని ఇతర విషయము.

నియమములు, పరినియమములు మరియు అధ్యాదేశములు అధికారిక రాజపత్రములో ప్రచురించబడుట మరియు పార్లమెంటు సమక్షమున ప్రవేశపెట్టబడుట.

39. (1) ఈ చట్టము క్రింద చేయబడినట్టి ప్రతి నియమము, ప్రతి పరినియమము మరియు ప్రతి అధ్యాదేశము అధికారిక రాజపత్రములో ప్రచురించబడవలెను.

(2) ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి నియమము, ప్రతి పరినియమము మరియు ప్రతి అధ్యాదేశము అది చేయబడిన సాధ్యమైనంత వెనువెంటనే పార్లమెంటు సమావేశమునందున్నపుడు, మొత్తము ముప్పై దినముల కాలావధిపాటు దాని ఉభయ సదనములందు ప్రవేశపెట్టవలెను, ఆ కాలావధి ఒకే అధివేశనములో గాని, లేదా దాని తరువాత వచ్చు రెండు లేదా అంతకంటే ఎక్కువ వరుస అధివేశనములలో గాని చేరివుండవచ్చును మరియు ఆ సమావేశము లోపల లేదా దాని అవ్యవహితానంతర సమావేశము ముగియు లోపలగాని దాని ఆ నియమము, పరినియమము లేదా అధ్యాదేశములో ఏదేని మార్పు చేయుటకు లేదా అవి చేయరాదని అంగీకరించియెడల ఆ నియమము, పరినియమము లేదా అధ్యాదేశము అట్టి మార్పు చేయబడిన రూపములో మాత్రమే అమలు కలిగివుండవలెను లేదా సందర్భానుసారము రద్దు కావలెను, అయినప్పటికినీ ఏదేని అట్టి మార్పు లేదా రద్దుతో నిమిత్తము లేకుండా, లోగడ ఆ నియమము, పరినియమము లేదా అధ్యాదేశము క్రింద చేయబడిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించరాదు.

ఇబ్బందులు తొలగించుటకు అధికారము.

40. (1) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినపుడు, కేంద్ర ప్రభుత్వము అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన ఉత్తరువు ద్వారా ఈ చట్టపు నిబంధనలకు అసంగతముగా లేనట్టియు ఆ ఇబ్బందిని తొలగించుటకు అవసరమని లేదా ఆవశ్యకమని తలచునట్టి నిబంధనలను చేయవచ్చును:

అయితే, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి మూడు సంవత్సరములు ముగిసిన మీదట ఈ పరిచ్ఛేదము క్రింద, అట్టి ఏ ఉత్తరువు చేయబడరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడినట్టి ప్రతి ఉత్తరువు అది చేయబడిన సాధ్యమైనంత త్వరగా, పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టబడవలెను.

పరివర్తనకాలిక నిబంధనలు.

41. ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ,-

(ఎ) ఈ చట్టము ప్రారంభమునకు అవ్యవహిత పూర్వము, ఆ విధముగా పని చేయుచున్న పాలకమండలి, ఈ చట్టము క్రింద ఆ సంస్థకు కొత్త బోర్డు ఏర్పాటు చేయబడనంత వరకు పనిచేయుట కొనసాగవలెను, అయితే ఈ చట్టము క్రింద కొత్త బోర్డు స్థాపించబడిన మీదట అస్థిత్వమునందున్న బోర్డు యొక్క సభ్యులు, తమ పదవులను కలిగివుండుట విరమించవలెను.

(బి) ఈ చట్టము క్రింద మొదటి పరినియమములు మరియు అధ్యాదేశములు చేయబడునంత వరకు, ఈ చట్టము యొక్క అవ్యవహితపూర్వము అమలులో ఉన్నట్లుగానే అస్థిత్వమునందున్న సంస్థల యొక్క పరినియమములు మరియు అధ్యాదేశములు, ఈ చట్టము యొక్క నిబంధనలకు అసంగతముగా లేనట్టి విధముగా, తదనుగుణమైన సంస్థలకు వర్తించుట కొనసాగవలెను.

## అనుసూచి

**(4వ పరిచ్ఛేదమును చూడుము)**

| వరుస సంఖ్య | అస్థిత్వమునందున్న సంస్థ యొక్క పేరు | తదనుగుణమైన సంస్థ యొక్క పేరు |
|---|---|---|
| (1) | (2) | (3) |
| 1. | ఆహార పదార్థ సాంకేతికత వ్యవస్థాపకత మరియు నిర్వహణ సంస్థ (ఎన్ఐఎఫ్‌టిఇఎమ్) కుండ్లి, హర్యానా. | ఆహార పదార్థ సాంకతికత, వ్యవస్థాపకత మరియు నిర్వహణ జాతీయ సంస్థ, కుండ్లి, హర్యానా. |
| 2. | భారత ఆహార పదార్థ తయారీ ప్రక్రియ సాంకేతిక సంస్థ (ఐఐఎఫ్‌పిటి) తంజావూరు, తమిళనాడు. | ఆహార పదార్థ సాంకేతిక, వ్యవస్థాపకత మరియు నిర్వహణ జాతీయ సంస్థ, తంజావూరు, తమిళనాడు. |

డా. రాజీవ్ మణి,
కార్యదర్శి, భారత ప్రభుత్వము.

Printed by the Commissioner of Printing at A.P. Legislative Assembly Printing Press, Amaravati.